

23న వికారాబాద్‌లో మెగా జాబ్ మేళా

వికారాబాద్, జూన్ 18: టీజీస్టెప్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఈనెల 23న వికారాబాద్‌లోని గౌలికార్ ఫంక్షన్ హాల్లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడలాధికారి హన్మంత్‌రావు తెలిపారు. ఈ మేళాలో 60కి పైగా కంపెనీలు పాల్గొంటున్నాయని, 5నుంచి 8వేల వరకు వివిధ కేటగిరిలో ఖాళీలున్నాయన్నారు. నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొనసాగుతున్న ఎల్లమ్మ జాతర

» ఆలయంలో భక్తుల రద్దీ

తాండూరు రూరల్, జూన్ 18: మండలంలోని కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. నెల రోజుల నుంచి ఉత్సవాలు అట్టహాసంగా సాగుతున్నాయి. మంగళ, శుక్రవారాల్లో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటున్నారు. జాతరలో భాగంగా చివరి మంగళవారం తాండూరు ప్రాంతంలోని చుట్టుపక్కల గ్రామాలప్రజలతోపాటు కర్ణాటక నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. డప్పువాయిద్యాల నడుమ మహిళలు బోనంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మరికొందరు భక్తులు వేపచీర ధరించి బోనంతో ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని భక్తులు అమ్మవారిని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శేఖర్‌గౌడ్, నాయకులు సందీప్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, సాయిలు, గోపాల్, ప్రవీణ్‌రెడ్డి, బసిరెడ్డి, పూజారి, శ్రీనివాస్, సిబ్బంది రవి తదితరులు పాల్గొన్నారు.



వేపచీరతో మొక్కు తీర్చుకుంటున్న భక్తురాలు

స్పోర్ట్స్ స్కూళ్లలో ప్రవేశాలకు ఎంపిక

వికారాబాద్, జూన్ 18: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో ఉన్న స్పోర్ట్స్ స్కూళ్లలో (హకీంపేట, కరీంనగర్,అదిలాబాద్)4వ తరగతి ప్రవేశాల కోసం మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో బాలబాలికలను ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రీడాధికారి హన్మంత్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈనెల 21వ తేదీ నుంచి 25వ తేదీ వరకు మండలస్థాయిలో ఎంఈవో ఆధ్వర్యంలో ఎంపికలు ఉంటాయని తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన వారికి వచ్చే నెల 3వ తేదీన జిల్లా స్థాయిలో వికారాబాద్ బ్లాక్ గ్రౌండ్ ఎంపిక ఉంటాయన్నారు. జిల్లాలో ప్రతిభ కనబర్చినవారికి వచ్చే 11, 12తేదీల్లో హకీంపేట స్పోర్ట్స్ స్కూళ్లలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లాక్రీడాధికారిని సంప్రదించాలని సూచించారు.



రోజురోజుకూ పెరుగుతున్న ధరలు వంటింట్లో కుంపటి లేపుతున్నాయి. ఏ నిత్యావసర వస్తువు కొందామన్నా వాటి ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి. ప్రతీ ఇంట్లో సాధారణంగా వినియోగించే టమాట ధర కిలో వందకు చేరింది. కూరల్లో వాడే అల్లం వెల్లుల్లి కిలో రేటు 200పై మాటే. ఆకుకూరల నుంచి కూరగాయల వరకు ధరలు భారీగా పెరిగాయి. అటు చికెన్ రేటు సైతం ఆకాశన్నంటింది. అలాగే కందిపప్పు రేటు ఎక్కువగానే ఉంది. మార్కెట్‌కు వెళ్లి ఏది తెచ్చి వండుకుందామన్నా అధిక ధరలతో సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. పోయిన వానాకాలంలో సరిగా వర్షాలు కురవక పోవడం, యాసంగిలో ఎండదెబ్బ, నీటి కొరతతో సాగు విస్తీర్ణం తగ్గి ఉత్పత్తి పడిపోయింది. ఈ కారణాలతో డిమాండ్‌కు సరిపడా సప్లయ్ లేకపోవడంతో కూరగాయల ధరలు భారీగా పెరుగుతున్నాయి.



ధరల మోత!

అమాంతం పెరిగిన కూరగాయల ధరలు

» ఆరు నెలలుగా సామాన్యుడికి అందని అల్లం వెల్లుల్లి
» మంట పుట్టిస్తున్న పచ్చిమిర్చి, టమాట, బీన్స్, చిక్కుడు
» బియ్యం, కంది పప్పు ధరలూ పైపైకి
» స్వల్పంగా పెరిగిన నూనెల ధరలు

ఆంధ్రజ్యోతి-రంగారెడ్డి అర్బన్/మేడ్చల్/తాండూరు/పరిగి, జూన్ 18: పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్యులు అల్లాడుతున్నారు. ఏ వస్తువు కొందామన్నా భగ్గుమంటున్న రేట్లతో ప్రజలకు చుక్కలు కనిపిస్తున్నాయి. పప్పు నుంచి ఉప్పు వరకు, కరివేపాకు నుంచి కాకరకాయ వరకు చికెన్ నుంచి అల్లంవెల్లుల్లి వరకు ఏది చూసినా అధిక ధరలు విపరీతంగా పెరిగాయి. పది రోజులుగా పెరుగుతున్న ధరలతో జనం బెంబేలెత్తుతున్నారు. కరువు, వేసవి దెబ్బ దిగుబడిలేక పెరిగిన ధరలతో అటు కొనుగోలుదారులు, ఇటు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. రూ.500 పెట్టినా రెండు రకాల కూరగాయలు, ఇద్దరు మనుషులకు మూన్నాలుగు రోజులు రావడం లేదు. ఇక కూరగాయల ధరలతో చికెన్ కూడా పోటీ పడుతోంది. కేజీ రూ.266కి పెరిగింది. అటు కూరగాయలు కొనలేక.. ఇటు చికెన్ తినలేక సామాన్యులు అల్లాడుతున్నారు. ఈ ధరలు ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో పచ్చడి అన్నం తప్పేలా లేదంటున్నారు పేద, మధ్య తరగతి ప్రజలు. ఇక అన్ని వంటకాల్లో తప్పనిసరిగా ఉపయోగించే టమాటా ధర ఇప్పటికే సెంచరీకి చేరింది. రైతు మార్కెట్లలో కిలో రూ.80 విక్రయిస్తున్నా రీటైల్‌గా మాత్రం రూ.90 నుంచి రూ.100కు అమ్ముతున్నారు. రానున్న రోజుల్లో ధర ఎంత పెరుగుతుందోనన్న ప్రశ్న రేకెత్తుతోంది. టమాటనే కాక మిగతా కూరగాయల పరిస్థితీ ఇలానే ఉన్నాయి. పచ్చిమిర్చి కిలో రూ.100 ఉంటే.. బీన్స్ ఈ ధరను దాటేసింది. ప్రస్తుతం కిలో బీన్స్ 160కి విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో చిక్కుడు సప్లయ్ తగ్గింది. ప్రస్తుతం దీని ధర కిలో రూ.100 ఉంది. కూరల్లో రుచి కోసం ఉపయోగించే అల్లంవెల్లుల్లి ధర అకాశానికి నిచ్చన వేసింది. కిలో అల్లం వెల్లుల్లి రూ.200కు విక్రయిస్తున్నారు. మిగతా కూరగాయల ధరలను పరిశీలిస్తే కాకరకాయ, బెండ, బీరకాయ ధరలు కిలో రూ.80 చొప్పున విక్రయిస్తున్నారు. క్యాలీఫ్లవర్, క్యారెట్, కిలో 50కి అమ్ముతున్నారు. ఆలుగడ్డ, ఉల్లిగడ్డ కిలో 40రూపాయలకు విక్రయిస్తుండగా కొత్తిమీర కట్ట 30రూపాయలు, ఒక నిమ్మకాయ 10రూపాయలకు విక్రయిస్తున్నారు. ఇదిలా ఉంటే బియ్యం, కంది పప్పు ధర భగ్గుమంటుంది. నెల క్రితం 160 రూపాయలు ఉన్న కందిపప్పు రూ.190కి చేరింది. నూనె ధరలూ స్వల్పంగా పెరిగాయి. లీటర్ నూనెపై ఐదు రూపాయలు పెరిగింది. గతేడాది ఇదే సమయంలో 25 కిలోల బియ్యం బస్తా 1,200కు విక్రయించగా ప్రస్తుతం 1,600కు అమ్ముతున్నారు. కూరగాయల ధరలు పెరగడానికి ఎండ దెబ్బ.. సకాలంలో వర్షాలు పడకపోవడం, దిగుబడి లేకపోవడం ఇలా అనేక కారణాలు కన్పిస్తున్నాయి. నెలాఖరు వరకు ఈ పరిస్థితి ఇలాగే ఉంటుందని.. రాబోయే రోజుల్లో టమాట, పచ్చిమిర్చి, ఉల్లిపాయల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.



చేవెళ్ల వ్యవసాయ మార్కెట్‌లో కూరగాయల వద్ద వ్యాపారుల సందడి

కూరగాయలు	కిలో ధర (రూపాయలు)
అల్లం వెల్లుల్లి	200
బీన్స్	160
టమాట	100
పచ్చిమిర్చి	100
చిక్కుడు	100
బెండకాయ	80
గోకర	80
కాకర	80
చామగడ్డ	80
బీరకాయ	80
దొండ	60
క్యారెట్	50
క్యాబేజీ	40
బీట్‌రూట్	50
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	40
కొత్తిమీర(ఒక కట్ట)	20
నిమ్మకాయ(ఒకటి)	10

టమాట, ఉల్లి, పచ్చిమిర్చి ధరలు తగ్గడం లేదు



వారం రోజుల నుంచి టమాట ధర తగ్గడం లేదు. కిలో 50 రూపాయలు ఉన్న టమాట 100 రూపాయలకు చేరింది. అల్లం వెల్లుల్లి ధర కూడా పెరిగింది. పచ్చిమిచ్చి, చిక్కుడు, బీన్స్, నిమ్మకాయల ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. డిమాండ్‌కు సరిపడా సరఫరా లేదు. అందుకే రేట్లు పెరుగుతున్నాయి.

- సుదర్శన్, కూరగాయల వ్యాపారి, లాల్‌పహాడ్

ఈసారే టమాట సాగు చేశా



ఈ సారి మొదటి సారి నేను టమాట పంట మూడెకరాల్లో సాగు చేశాను. బోరులో నీరుండటంతో డ్రిప్పు విధానంతో టమాట వేశాను. పంట పెట్టుబడిగా ఎకరానికి రూ.40వేల చొప్పున మూడెకరాలకు రూ.1.20లక్షలు ఖర్చు పెట్టాను. ఇప్పటి వరకు సగం కోత పూర్తి అయ్యింది. రూ.15లక్షల వరకు లాభం వచ్చింది. వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు సబ్సిడీపై డ్రిప్పు, విత్తనాలు ఇచ్చేవారు. ఇప్పుడు ఇవ్వడం లేదు. రైతులను ప్రోత్సహించాలి. సబ్సిడీలు అందిస్తేనే రైతులు వ్యవసాయం వైపు మొగ్గు చూపుతారు. అంతటా రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవడంతో రైతులు భూములు అమ్ముకొని వచ్చిన డబ్బులతో జీవిస్తున్నారు. దీంతో పంటల సాగు భారీగా తగ్గుతోంది. ఉత్పత్తి భారీగా పడిపోతూ ధరలు పెరుగుతున్నాయి.

- దేవులపల్లి గోపాల్‌రెడ్డి, రైతు, వనంపల్లి, జిల్లేడు చౌదరిగూడెం మండలం

భగ్గుమంటున్న కూరగాయల ధరలు



కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. రూ.500లతో మార్కెట్‌కు వెళితో బ్యాగు నిండా కూడా కూరగాయలు రావడం లేదు. ముఖ్యంగా టమాట, పచ్చిమిచ్చి వంటి నిత్యం కూరల్లో వాడే వాటి ధరలు మండిపోతున్నాయి. ఏ కూరగాయలైనా పావుకిలో రూ.40కి తక్కువకు దొరుకడం లేదు. పంట దిగుబడి రాకపోవడమే కూరగాయల పెరుగుదలకు కారణమని చెప్తున్నా పెరిగిన కూరగాల ధరలతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు.

- రూప, గృహిణి, మేడ్చల్

ఈ ధరలు ఎన్నడూ చూడలేదు



ఈ స్థాయిలో కూరగాయల ధరలను ఎన్నడూ చూడలేదు. బీరకాయ, మిర్చి కిలో రూ.120లకు చేరింది. ఇటీవల రూ.10లకు కిలో ఉన్న టమాట రూ.80లకు చేరింది. ఏ కూరగాయలు చూసినా రూ. వందకు చేరింది. కూరగాయలు కాకుండా ఏ వస్తువు కొనాలన్న ధరలను చూస్తే ఆలోచించాల్సి వస్తుంది.

-స్వరూప, గృహిణి,పరిగి

ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు



మార్కెట్‌లో ఏది ముట్టుకున్నా 50రూపాయల పైమాటే. కనీసం సాంబారు మెతుకులు తిందామంటే కూడా కందిపప్పు రేటు మండిపోతుంది. నాణ్యమైన కందిపప్పు కిలో 200 రూపాయలకు అమ్ముతున్నారు. కూరగాయలు కొందామన్నా.. ధరలు అందుబాటులో లేవు. టమాట, పచ్చిమిర్చి, బీన్స్, చిక్కుడు మంట పుట్టిస్తున్నాయి. రూ.500 తీసుకుని మార్కెట్‌కు వెళితే నిండా ఐదారు కిలోల కూరగాయలైనా రావడం లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే సామాన్యుల పరిస్థితి కష్టమే.

- డి.సువర్ణ, గృహిణి, చేవెళ్ల

మార్కెట్ల నిర్మాణ పనులు నత్తనడక

» నాలుగు కార్పొరేషన్లు, తొమ్మిది మునిసిపాలిటీల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణాలకు నిధులు మంజూరు
» కొన్ని చోట్ల శంకుస్థాపనలతోనే సరి

మేడ్చల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణాలోని ప్రతీ పట్టణంలో నాణ్యమైన ఆహారపదార్థాలు అందజేసేందుకు సమీకృత మార్కెట్ల నిర్మాణం కోసం గత ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించింది. నాణ్యతతో కూడిన పండ్లు, కూరగాయలు, మాంసం తినాలని గజ్వేల్‌లో నిర్మించిన సమీకృత మార్కెట్‌తో అద్భుత ఫలితాలున్నాయని భావించి గత ప్రభుత్వం సమీకృత మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అయితే మేడ్చల్ జిల్లాలో సమీకృత మార్కెట్ల నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. జిల్లాలో కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, పట్టణ ప్రజలకు అన్ని రకాల మాంసం, చేపలు, చికెన్, కూరగాయాలు, పండ్లు విక్రయాలను ఒకే చోట అందించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ల నిర్మాణం చేపట్టడానికి మూడేళ్ల క్రితం నిధులు మంజూరు చేసింది. కార్పొరేషన్లలో రూ. 4.50 కోట్లు, మునిసిపాలిటీల్లో రూ. రెండున్నర కోట్ల నిధులను మార్కెట్ల నిర్మాణానికి మంజూరు చేశారు. కానీచాలా చోట్ల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ప్రారంభమైన చోట పనులు నత్తనడుక సాగుతున్నాయి.

మున్సిపాలిటీల్లో అంతంతే..

గజ్వేల్‌తో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్మాణం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ వెజ్,నాన్ వెజ్ మార్కెట్లతో మంచి ఫలితాలు వచ్చాయి. దీంతో కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో కూడా ఇలాంటి తరహా సమీకృత మార్కెట్ల నిర్మాణానికి గత ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. ఈ మార్కెట్ల నిర్మాణానికి రెండు ఎకరాల నుంచి నాలుగు ఎకరాల స్థలం కేటాయించాలని అధికారులు భావించారు. ఘట్‌కేసర్, పోచారం మునిసిపాలిటీల్లో ఇంకా స్థల వివాదం కొనసాగుతుంది. మేడ్చల్‌లో మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు కానీ పనులు ప్రారంభం కాలేదు. గుండ్ల పోచంపల్లిలో బేస్‌మెంట్ స్థాయి వరకు పనులు చేపట్టారు. తూంకుంట మున్సిపల్‌లో స్థల సమస్య నెలకొంది. దుండిగల్, కొంపల్లి మునిసిపాలిటీల్లో కూడా ఇదే సమస్య నెలకొంది. ఈ మునిసిపాలిటీల్లో మార్కెట్ల నిర్మాణానికి రూ. రెండున్నర కోట్ల నిధులు కేటాయించారు. జిల్లాలో ఇప్పటి వరకు ఏ ఒక్క మున్సిపాలిటీలో కూడా పనులు సక్రమంగా సాగడం లేదు.



మేడ్చల్‌లో రోడ్లపైనే మార్కెట్ నిర్వహణ

కార్పొరేషన్లలో కూడా..

మేడ్చల్ జిల్లాలో ఫీర్జాదిగూడ, జవహర్‌నగర్, బోడుప్పల్, నిజాంపేట కార్పొరేషన్లలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు ప్రారంభమైనప్పటికీ నత్తనడకన కొనసాగుతున్నాయి. ఈ కార్పొరేషన్లలో మార్కెట్ల నిర్మాణానికి ఒక్కొక్కదానికి రూ. 4.50 కోట్లను కేటాయించారు. ఇక్కడ కూడా పనులు మాత్రం నత్తనడుకనే సాగుతున్నాయి.

రోడ్లపైనే విక్రయాలు..

జిల్లాలోని మున్సిపాలిటీలు,, కార్పొరేషన్లలో ఇప్పటికీ కూరగాయలు, పండ్లు, మాంసం విక్రయాలు రోడ్ల పైనే జరుగుతున్నాయి. నగరానికి కూతవేటు దూరంలో ఉన్న జిల్లాలో చిరువ్యాపారులు ఇప్పటికీ సరైన మార్కెట్ స్థలాలు లేకపోవడంతో రోడ్లపైనే తమ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో రోడ్లపై ట్రాఫిక్ ఇక్కట్లతో పాటు పండ్లు, కూరగాయలు దుమ్ము, ధూళితో కలుషితమౌతున్నాయి, ఇది ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతున్నది. ఈ సమస్యను అధిగమించేందుకు గత ప్రభుత్వం సమీకృత మార్కెట్‌లను నిర్మించాలని తలపెట్టినప్పటికీ పనులు నత్తనడకన కొనసాగుతుండటంతో ముందుకుపోవడం లేదు. ప్రస్తుతం కొత్త ప్రభుత్వ హయంలోనైనా పనులు వేగంగా చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

గుంతను పూడ్చివేస్తాం

» తహసీల్దార్ తారాసింగ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు రూరల్, జూన్ 18: 'అంతారం పెద్ద చెరువుకు గండి' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి తాండూరు తహసీల్దార్ తారాసింగ్ స్పందించారు. మంగళవారం చెరువుకట్ట గండిని ఆర్ఐ బాల్‌రాజ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు భారీ గుంత ఏర్పడిందని చెప్పారు. గుంతకు మరమ్మతులు చేయాలని ఇరిగేషన్ అధికారులకు లేఖ రాస్తామన్నారు. అనంతరం ఎల్మకన్నె శివారులోని కాగ్నా నదిపై నిర్మించిన చెక్‌డ్యాంను పరిశీలించారు. భారీ వర్షాలు కురిస్తే చెక్‌డ్యాం నిండి చుట్టుపక్కల పొలాలు నీట మునుగుతాయని రైతు బసిరెడ్డి ఫిర్యాదు చేశారు. బసిరెడ్డి ఫిర్యాదు మేరకు తహసీల్దార్ చెక్‌డ్యాంను పరిశీలించి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. అంతకుముందు ఇరిగేషన్ ఏఈ సాయిబన్న కూడా అంతారం చెరువు ఆయకట్టు వద్ద గుంతను పరిశీలించారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ ఏఈ సాయిబన్న కూడా చెరువు కట్ట వద్దకు చేరుకుని గండిని పరిశీలించారు. త్వరలోనే ఈ గండికి మరమ్మతులు చేస్తామని తెలిపారు.



పెద్ద చెరువుకు పడిన గండిని పరిశీలిస్తున్న తహసీల్దార్ తారాసింగ్, ఆర్ఐ బాల్‌రాజ్

పల్లెకు పచ్చతోరణం



హరితహారంలో నాటిన చెట్లు ఊరికి పచ్చతోరణంలా మారాయి. పెద్దేముల్ మండలం దుగ్గాపూర్ గేటు నుంచి గ్రామం వరకు సుమారు అరకిలోమీటర్ దూరం ఉంటుంది. గేటు నుంచి గ్రామం వరకు గల బీటీరోడుకు ఇరు పక్కల హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఇప్పుడు వృక్షాలు మారాయి. అవి కాస్త గ్రామానికి పచ్చనితోరణం కట్టినట్లుగా చూపరులను ఆకట్టుకుంటున్నాయి. పెద్దేముల్, జూన్18

ఎన్నాళ్లీ కష్టాలు..!

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు ధీటుగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఓ వైపు ప్రభుత్వం, విద్యా శాఖ అధికారులు ఊదరగొడుతున్నా క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా ఉంది. మేడ్చల్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో కనీసం మరుగుదొడ్లు లేక విద్యార్థినులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు దాదాపు అర కిలోమీటరు దూరంలో ఉన్న సులభ్ కాంప్లెక్స్‌లో తమ అవసరాలు తీర్చుకునేందుకు క్యూ కడుతున్నారు. విరామ సమయంలో విద్యార్థినులు పాఠశాల నుంచి సులభ్ కాంప్లెక్స్ చేరుకునేందుకు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. విద్యార్థినుల ఇబ్బందులు చూసి ప్రజలు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- మేడ్చల్ జూన్18, (ఆంధ్రజ్యోతి)



నేడు రక్తదాన శిబిరం

కులకచర్ల, జూన్ 18: స్థానిక పీవీఆర్ ఫంక్షన్ హాలులో కుమ్మరి స్వామి జన్మదిన సందర్భంగా గురువారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు చంద్రలింగం మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురి అరెస్ట్

● ఘట్‌కేసర్‌లో ముగ్గురు, మేడ్చల్‌లో ఇద్దరు నిందితుల రిమాండ్
● మొత్తం 5.50కిలోల గంజాయి స్వాధీనం



ముగ్గురు నిందితుల అరెస్టు చూపుతున్న ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు

మేడ్చల్ టౌన్/ఘట్‌కేసర్ రూరల్, జూన్ 18: గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని మేడ్చల్, ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, రాఘవేంద్ర హోటల్ సమీపంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా బైక్‌ను ఆపి సోదాచేయగా అందులో రెండు కిలోల గంజాయి పట్టుబడింది. బైక్ నడుపుతున్న ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, బాలాజీనగర్‌కు చెందిన సయ్యద్ జఫర్(24), యాదాద్రి- భువనగిరి, బీబీనగర్ మండలం, నెమురగొమ్ములకు చెందిన పల్లపు గణేష్, నగరానికి చెందిన రాజుకుమారి బాయి(43)లను అదుపులోకి తీసుకున్నారు. 500 గ్రాముల గంజాయితో పాటు హోండా షైన్ బైక్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. మేడ్చల్‌లో ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపిన వివరాల ప్రకారం.. దేవర్ యాంజాల్ కేశినేని కార్గో కారియర్ సమీపంలో నివసించే ఒడిశాకు చెందిన శంకర్‌బాగ్(28), సిబాఖిలా(24)లు మంగళవారం శామీర్‌పేట మండలం దేవర్ యాంజాల్ వైపు నుంచి మేడ్చల్ వస్తుండగా ఎక్సైజ్ పోలీసులు వారిని సోదాలు నిర్వహించారు. వారి వద్ద నుంచి మూడు కిలోల 50గ్రాముల బంగారం లభించింది. దీంతో ఇద్దరిని అదుపులో తీసుకుని విచారించగా మేడ్చల్ పారిశ్రామిక వాడలోని లేబర్లకు, కళాశాలల విద్యార్థులకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. గంజాయితోపాటు ఇద్దరు నిందితుల వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.



మేడ్చల్ టౌన్: ఎక్సైజ్ అధికారులకు పట్టుబడిన నిందితులు


ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేస్తున్న పోల్కంపల్లి రైతులు

పొలాల్లో కల్లు విక్రయాలను అరికట్టాలి

ఇబ్రహీంపట్నం, జూన్ 18:మండలంలోని పోల్కంపల్లిలో కల్లు గీత కార్మికులు ఇష్టానుసారం పొలాల్లో కల్లు అమ్మకాలు జరుపుతూ పంటచేలకు నష్టం చేకూరుస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పొలాల్లో కల్లు అమ్మకాలు జరపకుండా చూడాలని మంగళవారం ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ సీతారాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఏదో ఒకచోట షెడ్డు వేసుకొని తాటికల్లు విక్రయించకుండా చెట్టు ఎక్కడుంటే అక్కడే పొలాల్లో విక్రయాలు జరుపుతున్నారని, దీంతో కల్లు కోసం వచ్చే వారు పంటలను తొక్కుతున్నారని, అలాగే కల్లు ప్రియులతో పొలాల్లో పనిచేసుకునే మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని సీఐకి వివరించారు. పొలాల్లో కూలేందుకు సిద్ధంగా ఉన్న, కల్లుగీతకు పనికిరాని తాటిచెట్లను తొలగించాలని కోరారు. తాటి కాయలు, మట్టలు పడి చేలు పాడవుతున్నా గీత కార్మికులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయమై వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు అధికారిని కోరారు.


ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కందుకూరు, జూన్ 18 : పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరిస్తూ పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్, సీపీఎం మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం భోజన కార్మిక సంఘం నాయకులతో కలిసి విద్యావనరుల కేంద్రం వద్ద ధర్నా చేశారు. అనంతరం ఎంఈవో మనోహర్‌కు వినతిపత్రం ఇచ్చారు. భోజన కార్మికులకు జీతాలు, బిల్లులు ఇవ్వడం లేదన్నారు. కార్మికులు అప్పు చేసి విద్యార్థులకు అన్నం వండి పెడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆరు నెలలవుతున్నా భోజన కార్మికుల సమస్యలపై దృష్టిపెట్టడం లేదన్నారు. ఉద్యోగులకు ప్రతీ 5వ తేదీలోపు వేతనాలు ఇస్తున్న ప్రభుత్వం పుస్తెలు తాకట్టుపెట్టి విద్యార్థులకు అన్నం వండిపెడుతున్న భోజన కార్మికుల బిల్లులు ఎందుకు చెల్లించదని ప్రశ్నించారు. మార్కెట్‌లో కోడిగుడ్డు, టమాట, ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి తదితర కూరగాయల ధరలు విపరీతంగా పెరిగినా ప్రభుత్వం మెస్‌చార్జీలు మాత్రం పెంచడం లేదన్నారు. ఆందోళన కార్యక్రమంలో భోజన కార్మిక సంఘం నాయకులు శ్రీను, ప్రభావతి, అండాలు, అశ్విని, లక్ష్మమ్మ, భారతమ్మ, భాగ్యమ్మ, కలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఫాం ల్యాండ్ పేరుతో నయా దందా

- వ్యవసాయ భూములను ప్లాట్లుగా మారుస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు

మర్పల్లి, జూన్ 16: ఫాం ల్యాండ్ పేరుతో పల్లెల్లో పదుల సంఖ్యలో వెంచర్లు పుట్టుకొస్తున్నాయి. వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చుతున్నారు. దీంతో పచ్చని పంట పొలాలు బీడుగా కనిపిస్తున్నాయి. అక్రమార్కులు ప్రభుత్వ నిబంధనల్లోని లోసుగులను ఆసరాగా చేసుకొని నాలా పన్నును ఎగవేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మర్పల్లి మండలంలోని పట్లూర్, ఘనపూర్, తుమ్మలపల్లి, బిల్కల్, మల్లికార్జునగిరితో పాటు తదితర గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లో వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. రోడ్డుపక్కన సిమెంట్ కడ్డీలతో ప్రహరీ నిర్మిస్తూ ప్రధాన రహదారిలో అందమైన ఫెన్సింగ్, పొలాల్లో రోడ్లు ఏర్పాటుచేసి ఫాం ల్యాండ్ పేరుతో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు నయా దందాకు తెరలేపారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వహిస్తుండటంతో రియల్ వ్యాపారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

ప్రభుత్వ ఖజానాకు గండి

వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చాలంటే ప్రభుత్వానికి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అమ్మకందారులు కొనుగోలుదారులు రిజిస్టర్ కార్యాలయాల్లో నిబంధనల మేరకు మార్కెట్ ధరను బట్టి డబ్బులు చెల్లించాలి. అదేవిధంగా 10శాతం భూమిని గ్రీన్‌ల్యాండ్‌కు సంబంధిత గ్రామపంచాయతీకి అప్పగించాల్సి ఉంటుంది. మరో 15శాతం భూమిని రోడ్లకు కేటాయించి సదరు భూమిని పంచాయతీ పేరుపై రిజిస్ట్రేషన్ చేసి అనుమతి పొందాల్సి ఉంటుంది. ఈ నిబంధనలను తుంగలో తొక్కుతూ కొందరు రియల్ వ్యాపారులు పన్ను చెల్లించకుండానే వ్యవసాయ భూములను కొనుగోలు చేసి భూముల చుట్టూ సిమెంట్ కడ్డీలను ఏర్పాటు చేసి పొలాల్లో రోడ్లు వేసి ప్లాట్లుగా మార్చేస్తున్నారు.


వ్యవసాయ పొలంలో ఫాం ల్యాండ్

ధరణిలో అందివచ్చిన అవకాశం

వ్యవసాయ భూములను ఫాం ల్యాండ్ పేరుతో వెంచర్లుగా ఏర్పాటు చేసి విక్రయిస్తున్న రియల్ వ్యాపారులు 'ధరణి'లో అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. గుంట భూమి సైతం రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు అవకాశం ఉండటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు గుంట లెక్కన విక్రయిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. తర్వాత ఫాం ల్యాండ్ పేరుతో నిబంధనలను తుంగలో తొక్కి నయా తరహాలో వెంచర్లుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ ద్వారా గుంట భూమిని అతి తక్కువ ధరకే అమ్ముతున్నామని, చుట్టుపక్కల హైవే రోడ్డు, ఆసుపత్రులు, రైల్వేస్టేషన్‌ను చూపిస్తూ ఆన్‌లైన్‌లో జోరుగా విక్రయిస్తున్నారు. మరి కొంతమంది వ్యాపారులు భూమి విక్రయించిన సదరు కొనుగోలుదారులకు అప్పగించకుండానే తామే అభివృద్ధిచేసి ఇస్తామని మాయమాటలు చెబుతున్నారు. రోజురోజుకు మర్పల్లి మండలంలో ఫాం ల్యాండ్ దందా ఎక్కువవుతున్నా పట్టించుకునే అధికారులే కరువయ్యారని మండల ప్రజలు తెలిపారు. గతంలో కొంతమంది సర్పంచుల సహకారంతో అనుమతి లేని వ్యవసాయపొలాల్లో రోడ్లు పూర్తిచేసి అక్కడక్కడ భవనాలు నిర్మించారు. ఇప్పటికైనా సంబంధితాధికారులు స్పందించి అనుమతిలేని వెంచర్లపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

డంపింగ్ యార్డు పనులను నిలిపివేయాలి

శంకర్‌పల్లి, జూన్ 18 : బయన్నగూడలో చెత్త డంపింగ్ యార్డు పనులను నిలిపివేయాలని ప్యాక్స్ డైరెక్టర్ కాడిగారి రాజశేఖర్‌రెడ్డి డిమాండు చేశారు. బయన్నగూడలో డంపింగ్ యార్డు ఏర్పాటు వద్దని కోరుతూ మంగళవారం గ్రామస్తులతో కలిసి ఆయన ఎంపీడీవో కార్యాలయ అధికారి రవిందర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గతంలో బయన్నగూడలో యార్డును ఏర్పాటు చేయగా, గ్రామస్తుల అభ్యంతరంతో అధికారులు విరమించుకున్నారని గుర్తుచేశారు. తిరిగి అదే స్థలంలో డంపింగ్ యార్డు పనులు చేపట్టే నిర్ణయం తగదన్నారు. డంపింగ్ యార్డు ఏర్పాటు చేసే స్థలానికి దగ్గరగా గ్రామస్తులకు బయన్నగుడి ఉందని తెలిపారు. ప్లాంటును ఏర్పాటు చేస్తే దుర్వాసన, కాలుష్యంతో గ్రామస్తులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. మహాలింగపురం పరిసరాల్లోనే డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.


ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు


వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర బీసీ సేనా అధ్యక్షుడు కృష్ణయాదవ్

బీసీ కుల గణన చేపట్టాలి

వికారాబాద్, జూన్ 18:ప్రభుత్వం వెంటనే బీసీ కులాల గణన చేపట్టాలని బీసీ సేనా రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం వికారాబాద్ కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోపే బీసీ కులగణన చేపడుతామని చెప్పి ఇంకా చేపట్టడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కులాలగణన చేపట్టకపోగా, సకాలంలో నిర్వహించాల్సిన సర్పంచ్ ఎన్నికలను వాయిదా వేయడం వల్ల గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వారం గడువులో బీసీల జనాభా గణన సంపూర్ణంగా చేపట్టవచ్చని అన్నారు. ఆలస్యం చేయడం కేవలం రాజకీయ కారణమేనని, తక్షణమే సీఎం బీసీ కులగణన చేపట్టాలన్నారు. లేదంటే పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సంగమేశ్వర్, లక్ష్మణ్ యాదవ్, కావలిరాములు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఎర్రమట్టి తవ్వకాలు


ఎర్రమట్టి తవ్వకాలు

నవాబుపేట, జూన్ 18: మండలంలోని మముదాన్‌పల్లి గ్రామంలో ఎలాంటి అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. యథేచ్ఛగా ఎర్రమట్టి తవ్వకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. మూడు రోజులుగా ప్రభుత్వ సెలవులు ఉండటంతో ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు ఎర్రమట్టిని తోడేస్తున్నారు. ఈ దందాలో వికారాబాద్‌లోని ఓ ప్రముఖ కాంట్రాక్టర్ హస్తం ఉండటంతో తహసీల్దార్ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపించారు.


మెడికల్ కళాశాలకు కేటాయించిన భూముల వద్ద రైతులతో మాట్లాడుతున్న కేఎల్లార్, కోదండరెడ్డి

మెడికల్ కళాశాల భూములను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యేలు

కందుకూరు, జూన్ 18 : మండలంలోని మీర్కాన్‌పేట పరిధిలో గత ప్రభుత్వం మెడికల్ కళాశాలకు కేటాయించిన భూములను మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ధరణి చైర్మన్ కోదండరెడ్డి పరిశీలించారు. మంగళవారం జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, తహసీల్దార్ కె.గోపాల్‌తో కలిసి వారు భూములను పరిశీలించారు. మీర్కాన్‌పేట పరిధి 112 సర్వే నంబర్‌లో 60 ఎకరాల భూమిని మెడికల్ కళాశాలకు కేటాయిస్తూ నిధులు మంజూరు చేశారు. కాగా ఈ భూమి మెడికల్ కళాశాల ఏర్పాటుకు అనుకూలంగా ఉందా? అని స్థానిక నేతలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కె.రాణాప్రతాప్‌రెడ్డి, డిల్లీ శ్రీధర్, జి.యాదయ్య, ఎస్.పాండు, డి.నర్సింహాచారి, ఏజీ.పాండుగౌడ్, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, జగన్, డి.నర్సింహ, సాయిలు, ఎ.సురేందర్, రూప్లానాయక్, జి.యాదయ్య, సంతోష్, శ్రీను, జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఆరు గ్యారంటీ'లను సద్వినియోగం చేసుకోవాలి


మల్లు రవిని సన్మానిస్తున్న గుర్రం కేశవులు, రమేశ్

ఆమనగల్లు, జూన్ 18 : ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలను నిరుపేదలంతా సద్వినియోగం చేసుకోవాలని నాగర్‌కర్నూల్ లోక్‌సభ సభ్యుడు మల్లు రవి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చుతుందన్నారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ గర్రం కేశవులు, ఆర్యవైశ్య సంఘం నాయకుడు బికుమాండ్ల రమేశ్‌ల ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు మంగళవారం రవిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఎంపీగా గెలిచిన ఆయన్ను సత్కరించారు. మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని నాయకులు విన్నవించారు. మల్లు రవి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పెరిగిన ఓటింగ్ శాతం దీనికి రుజువన్నారు. రైతుల రూ.2లక్షల రుణమాఫీకి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని, సీఎం ప్రకటించిన విధంగా ఆగస్టు 15నాటికి రునమాఫీ పూర్తి చేస్తారని చెప్పారు. సామాజిక న్యాయం, అన్ని వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనునాయక్,మధుసూదన్‌రెడ్డి, కృష్ణనాయక్, వస్పుల మానయ్య, తదితరులు పాల్గొన్నారు.


మహేష్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యమకారుల ఫోరం నాయకులు

ఉద్యమకారులకిచ్చిన హామీలను అమలు చేయాలి

మహేశ్వరం, జూన్ 18 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చామ శ్రీనివాస్, పల్నాటి నరేష్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఫోరం నాయకులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ప్రతీ ఉద్యమకారునికి 250గజాల ఇంటిస్థలం, పెన్షన్, బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం తదితర హామీలను అమలు చేయాలన్నారు. స్పందించిన మహేష్‌కుమార్‌గౌడ్ ఉద్యమకారుల సమస్యలపై ముఖ్యమంత్రితో చర్చించి దాని కోసం ఓ కమిటీని ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యమకారులు నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

డబీల్‌పూర్‌లో సీతారాముల విగ్రహాలు ధ్వంసం

మేడ్చల్ టౌన్, జూన్ 18 : గుర్తు తెలియని దుండగులు ఆలయంలో సీతారాముల విగ్రహాలను ధ్వంసం ధ్వంసం చేసిన ఘటన మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తీవ్ర కలకలం సృష్టించింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలనాకి చేరుకుని విచారణ చేపట్టి గ్రామస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టె చర్య పట్ల గ్రామస్తులను అప్రమత్తం చేసి నిందితులను పట్టుకుంటామని భరోసా ఇచ్చారు. అందరు కలిసి మెలిసి ఉండే గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకోవటం పట్ల స్థానికులు విచారం వ్యక్తం చేశారు. గ్రామంలో వాతావరణం విచ్ఛిన్నం చేయటానికి ప్రయత్నించిన వారిన ఉపేక్షించరాదని గ్రామస్తులు పోలీసులను కోరారు. వివరాల్లోకి వెళితే మేడ్చల్ మండలంలోని డబీల్‌పూర్ గ్రామ శివార్లలోని గుట్టపై సీతారాముల ఆలయంలో గుర్తు తెలియని దుండగులు ప్రవేశించారు. సీతారాముల విగ్రహాలను ధ్వంసం చేశారు. మంగళవారం ఓ భక్తుడు స్వామి వారిని దర్శించుకోవడానికి ఆలయానికి వెళ్లగా విగ్రహాలను ధ్వంసం చేసినట్లు గుర్తించి గ్రామ పెద్దలకు చెప్పాడు. గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన మేడ్చల్ అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సత్యనారాయణ, ఎస్ఐమురళీధర్ సిబ్బందితో ఆలయం వద్దకు చేరుకున్నారు. అప్పటికే విగ్రహాల ధ్వంసం పట్ల తీవ్ర ఆగ్రహంతో ఉన్న గ్రామస్తులతో పోలీసులు సంప్రదింపులు జరిపి ఆలయ నిర్వాహణ గురించి తెలుసుకున్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టటానికి దుండగులు ఈ చర్యకు పాల్పడ్డారని పోలీసులు గ్రామస్తులను సముదాయించారు. దీంతో గ్రామస్తులు శాంతించి దుండగులను పట్టుకుని శిక్షించటానికి తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం పోలీసులు ఘటనా స్థలంలో ప్రాథమిక విచారణ జరిపారు. అనుమానితుల గురించి అడిగి తెలుసుకున్నారు. కాగాగ్రామంలో అన్ని మతాల వారు సామరస్యంగా కలిసి మెలిసి ఉంటున్నారని అయినప్పటికీ ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం దురదుష్టకరమన్నారు. ఘటనపై పూర్తి విచారణ జరిపి నిందితులను పట్టుకుంటామని పోలీసు అధికారులు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కాగా శాంతి భద్రతల దృష్ట్యా గ్రామంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి వరకు సీఐ సత్యనారాయణ గ్రామంలో ఉండి పరిస్థితిని సమీక్షించారు.


ఆలయంలో దుండగులు ధ్వంసం చేసిన సీతారాముల విగ్రహాలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

ఉపాధ్యాయురాలి కుటుంబానికి రూ.15లక్షల పరిహారం మంజూరు

బషీరాబాద్, జూన్ 18: ఎన్నికల శిక్షణలో భాగంగా విధుల్లో పాల్గొని ఆకస్మాత్తుగా మృతిచెందిన ఉపాధ్యాయురాలి కుటుంబానికి రూ.15లక్షల పరిహారాన్ని మంజూరు చేసింది. ఈమేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలోని టాకీ తండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న రాణి తాండూరు పట్టణంలో ప్రభుత్వ నంబర్-1 ఉన్నత పాఠశాలలో ఎన్నికల శిక్షణలో భాగంగా విధులకు హాజరై సాయంత్రం ఇంటికి వెళ్లే క్రమంలో వడదెబ్బకు ఆకస్మాత్తుగా మృతిచెందిన విషయం తెలిసిందే. స్థానిక తాండూరు ఆర్డీవో, పార్లమెంట్ ఎన్నికల సహాయ అధికారి శ్రీనివాస్‌రావు నివేదిక ఆధారంగా కలెక్టర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నారాయణరెడ్డి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నివేదికను పంపించారు. ఈమేరకు ఎన్నికల కమిషన్ ఉపాధ్యాయురాలు రాణి కుటుంబానికి ఆర్థికసాయంగా రూ.15లక్షలు మంజూరుచేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సాయాన్ని కలెక్టర్ చేతుల మీదుగా త్వరలో అందజేయనున్నారు.

ఇంటి నెంబర్లు ఇవ్వడంలో జాప్యం తగదు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరమేష్

వికారాబాద్, జూన్ 18: వికారాబాద్ మున్సిపల్ పరిధిలో కొత్తగా నిర్మించే ఇళ్లకు ఇంటినెంబర్లు ప్రభుత్వ నిబంధన ప్రకారం ఇవ్వాల్సిందేనని, అలాకాకుండా ఎవరైనా అవకతవకలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ హెచ్చరించారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మంగళవారం మున్సిపల్ రెవెన్యూ విభాగంతో చైర్‌పర్సన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలో నివాసముంటున్న ప్రజలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సేవలందించాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. వికారాబాద్ పట్టణంలో కొత్తగా నిర్మించిన ఇళ్లకు ఇంటినెంబర్లు కేటాయించడంలో రెవెన్యూ సిబ్బంది అవకతవకలకు పాల్పడుతున్నారని చైర్‌పర్సన్ దృష్టికి రావడంతో ఇలాంటివి ఇకపై పునరావృతం కాకూడదని హెచ్చరించారు. అదేవిధంగా ప్రభుత్వ నిబంధన ప్రకారం మున్సిపాలిటీకి మరింత ఆదాయం వచ్చేలా రెవెన్యూ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్‌అహ్మద్, ఆర్వో కృపాకర్, బిల్‌కలెక్టర్లు పాల్గొన్నారు.

శుద్ధమైన జలాలను సరఫరా చేయాలి



ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర రూరల్, జూన్ 18: పురపాలక ప్రజలకు శుద్ధమైన జలాలను సరఫరా చేయాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. పురపాలక పరిధిలోని 16వ వార్డు రాజ్‌సుఖ్‌నగర్‌లోని ఓవర్‌హెడ్ ట్యాంక్ పైకి మంగళవారం వెళ్లి ట్యాంకు పరిస్థితిని పరిశీలించారు. ప్రతీ ట్యాంక్‌ను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, నీటిని శుద్ధి చేసి ఇళ్లకు సరఫరా చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. నీటి సామర్థ్యం పెంపునకు అదనంగా చేపట్టిన ట్యాంకులు, సంపుల నిర్మాణాలు పూర్తి కావచ్చన్నారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని పురపాలక ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వాటర్‌మెన్‌లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న గ్రామస్థులు

దోమ, జూన్ 18: మండలంలోని అయినాపూర్ గ్రామ ఉన్నత పాఠశాలకు నూతనంగా వచ్చిన ప్రధానోపాధ్యాయుడు బాబు చంద్‌ను మంగళవారం మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోవర్ధన్ ముదిరాజ్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా అయినాపూర్ పాఠశాలలో హెచ్‌ఎం, హిందీ సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయులులేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు పడేవారు. హిందీ ఉపాధ్యాయుడి నియామకానికి కృషి చేస్తామని బాబుచంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్ల వెంకటేశ్, వెంకట్రాములు, రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీమా పాలసీ కుటుంబానికి అండ

కులకచర్ల, జూన్ 18: ప్రతీ వ్యక్తి జీవిత బీమా పాలసీ చేసుకుంటే ఆ కుటుంబానికి కొండంత అండగా ఉంటుందని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ హైదరాబాద్ జోన్ డీజీయం నరేందర్ అన్నారు. ముజాహిద్‌పూర్ ఉమ్మడి గ్రామ పంచాయతీ పరిధిలోని పటేల్ చెరువు తండాకు చెందిన వడత్య బామినిబాయి ఇటీవల గుండె పోటుతో మృతి చెందింది. ఆమెకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ పరిగి బ్రాంచీలో ఇన్సూరెన్స్ పాలసీ ఉండటంతో మంగళవారం ఆమెకు రూ.6,03,000 చెక్కును నామిని సక్రినాయక్‌కు అందించారు. మృతురాలు రూ.32వేలతో పాలసీ తీసుకున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు

● పట్టించుకోని అధికారులు



చౌదరిగూడలోని ప్రభుత్వ స్థలంలో చేపట్టిన నిర్మాణం

ఘట్‌కేసర్, జూన్ 18: మండలంలోని చౌదరిగూడలోని సర్వేనెంబర్ 869లో తమకు ప్రభుత్వం కేటాయించిన భూమిలో రాత్రికి రాత్రే నిర్మాణాలు చేస్తూ ఆక్రమిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. చౌదరిగూడలోని సర్వేనెంబర్ 869లోని 11ఎకరాల 32గుంటల వ్యవసాయ భూమిని 50సంవత్సరాల కిందట తొమ్మిది మంది భూమిలేని పేదలకు అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసింది. కొంతకాలం ఆరుతడి పంటలు సాగుచేసిన లబ్ధిదారులు అనంతరం ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగుకు దూరంగాఉన్నారు. ఈస్థలం గ్రామానికి సమీపంలో ఉండటంతో గతంలో కొంతమందికి ఇళ్లపట్టాలు జారీ చేశారు. తమకు కేటాయించిన స్థలంలో తమకు తెలియకుండా పట్టాలు ఇవ్వడమేంటని ఆ తొమ్మిది మంది దళిత రైతులు న్యాయ పోరాటం సాగిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన స్థానిక నాయకులు అక్రమ నిర్మాణాలను ప్రోత్సస్తున్నారని ఆరోపిస్తున్నారు. రాత్రికి రాత్రే ఇళ్లు నిర్మిస్తున్నారని వాపోయారు. తాము న్యాయం కోసం అధికారుల చుట్టూ తిరుగుతుంటే ఒకటి రెండు రోజుల్లోనే నిర్మాణాలు పూర్తిచేస్తున్నా గ్రామపంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఎలాంటి నిర్మాణాలు చేపట్టొదని కోర్టు ఉత్వరులు ఉన్నా పట్టించుకోకుండా స్థానిక నాయకులు డబ్బులు దండుకొని అక్రమ నిర్మాణాలను కట్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు. తాము అధికారులకు ఫిర్యాదు చేస్తే ఏమాత్రం పట్టించుకోవడం లేదని జిల్లా ఉన్నాతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను అడ్డుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

చర్యలు తీసుకుంటాం



చౌదరిగూడ పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 869లో రాత్రికిరాత్రే అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఇప్పటికే పలుమార్లు కూల్చివేతలు చేపట్టామన్నారు. తిరిగి నిర్మాణాలు చేపట్టిన విషయం సమాచారం అందింది. వెంటనే చర్యలు తీసుకుంటాం. గ్రామ పంచాయతీ నుంచి అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవు.
- శశికుమార్, పంచాయతీ కార్యదర్శి, చౌదరిగూడ

కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగులు



కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిసిన తహసీల్దార్ మనోహర చక్రవర్తి

వికారాబాద్, జూన్ 18: వికారాబాద్ కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రతీక్ జైన్‌ను మంగళవారం జిల్లా అధికారులు, ఆయాశాఖల ఉద్యోగసంఘాలు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలు, శాలువాలకు బదులుగా నోట్ పుస్తకాలు, పెన్నులు అందించి కలిశారు. ఇందులో భాగంగా తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌తో వెళ్లి కలిశారు. ఈ కార్యక్రమంలో ట్రెసా రాష్ట్రకార్యదర్శి మనోహర్ చక్రవర్తి, అమరేంద్రకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయేందర్, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు దీపక్, డివిజన్ అధ్యక్షుడు రమేష్, వీరేష్ బాబు, రెవెన్యూ యూనియన్ ప్రతినిధులు విజయకుమార్, పురుషోత్తం, గణేష్, మురళీధర్, సురేష్, విజయ్, శ్రీలత, రాజేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మోహన్, బాల్‌రాజు, నరేందర్, గోవర్ధన్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన తహసీల్దార్

మోమిన్‌పేట్: వికారాబాద్ నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రతీక్‌జైన్‌ను తెలంగాణ తహసీల్దార్ సంఘం కార్యదర్శి, మోమిన్‌పేట్ తహసీల్దార్ మనోహరచక్రవర్తి మంగళవారం జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలు, పుష్పగుచ్ఛాలకు బదులుగా నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను అందజేశారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లను ఖాళీ చేయాలి



శిథిలావస్థకు చేరిన ఇంటిని పరిశీలిస్తున్న కమిషనర్

కీసర రూరల్, జూన్ 18: శిథిలావస్థకు చేరిన ఇళ్లను వెంటనే ఖాళీ చేయాలని నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్ కుమార్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని పలువార్డుల్లో మంగళవారం సందర్శించి, శిథిలావస్థకు చేరిఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ కావడంతో రానున్న రోజుల్లో మరింత విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. వర్షం ధాటికి దెబ్బతిన్న ఇళ్లుకూలి ప్రాణాపాయం కలిగే అవకాశముందని తెలిపారు. ఈ క్రమంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో నివాసముంటున్న వారిని వెంటనే ఆఇళ్లను ఖాళీ చేసి పక్కా ఇళ్లల్లోకి తరలివెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్ బాలమల్లేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన



పూడూరు రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ వీక్షిస్తున్న రైతులు, అధికారులు

పూడూరు, జూన్ 18: మండల కేంద్రంలోని రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులు రైతులను ఉద్దేశించి మాట్లాడారు. వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వరి, మక్కజొన్న సాగు పద్ధతులు, మెళకువలగురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, డివిజనల్ అధికారి లక్ష్మీకుమారి, పూడూరు, పరిగి, దోమ, కుల్కచర్ల, చౌడాపూర్ మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తీర్ణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

యాలాల: యాలాలలో రైతు వేదికలో మండల స్థాయి వ్యవసాయాధికారులు పత్తి సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తేలికపాటి భూములు ఉన్న రైతులను గుర్తించి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలంలో పంటలు నమోదు వివరాలను, శాఖాపరమైన స్కీమ్‌లపై వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికాధి యాదగిరి, తాండూరు మండల వ్యవసాయధికారి రజిత పాల్గొన్నారు.



పత్తి సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యసాయాధికారులు

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



కీసర: కరీంగూడలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

కీసర, జూన్ 18: ఇంటర్నేషనల్ ఓమౌజయా యునైటెడ్ యంగ్ స్టార్స్ అసోసియేషన్, ఓమౌజయా ఏకోపాసన మహధర్మ, శ్రీసంస్థాన్ ఫౌండేషన్ అధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. నిర్వహకుల అధ్వర్యంలో మంగళవారం మండల పరిధి కరీంగూడలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. గత 12సంవత్సరాలుగా ఇలాంటి సేవలు నిర్వహిస్తున్నామని, సేవలను విస్తృతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంశీ, విశ్వసారథి, ఈశ్వర్‌లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: శ్రీమల్లికార్జున అప్పాజీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సోదరుడి సతీమణి సరళారెడ్డి విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. మండలంలోని కరన్‌కోట్, చిట్టిఘనాపూర్ గ్రామాలను మల్లికార్జున్ అప్పాజీ మంగళవారం దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సరళారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేసి పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శరణబసప్ప, ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ రాజ్‌కుమార్, విలేకరి శెట్టి రవికుమార్, ఉ పాధ్యాయులు నర్సిరెడ్డి, కిష్టప్ప, ఉపాధ్యాయులు శివకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్ పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటుపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేసిన సరళారెడ్డితో విద్యార్థులు, నాయకులు

కేసీఆర్‌ను కలిసిన మేడ్చల్ బీఆర్ఎస్ నేత



మాజీ సీఎం కేసీఆర్‌తో బీఆర్ఎస్ మేడ్చల్ నాయకుడు సందీప్ గౌడ్

మేడ్చల్ టౌన్, జూన్ 18: మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావును మేడ్చల్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ నాయకుడు అత్వెల్లి సందీప్‌గౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు మర్రిరాజశేఖర్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం సందీప్‌గౌడ్ రాజశేఖర్ రెడ్డితో పాటు సందీప్ గౌడ్ కలిసి కేసీఆర్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేకపూజలు



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

శామీర్‌పేట, జూన్ 18: శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపల్‌కు చెందిన నరేందర్‌గౌడ్, వారి కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఈ అన్నదానంలో ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, భక్తులు, రాజీవ్‌రహదారిపై వెళ్లే భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

ఈ నెల 21న తైబజార్ వేలం



వివరాలు వెల్లడిస్తున్న కార్యదర్శి రాజేశ్

బొంరాస్‌పేట్, జూన్ 18: మండలంలోని తుంకిమెట్ల గ్రామంలో నిర్వహించే వారాంతపు కూరగాయల సంతకు ఈనెల 21న ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయం ఆవరణలో వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాజేశ్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి గానూ నిర్వహించే వేలంలో పాల్గొనే వారు ఒకరోజు ముందుగా డిపాజిట్ రూ.3వేలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

22న బషీరాబాద్‌లో..

బషీరాబాద్: బషీరాబాద్ తైబజార్ సంతకు వేలంను ఈనెల 22న స్థానిక గ్రామ పంచాయతీ కార్యాయంలో ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి జయకార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనే వ్యక్తులు రూ.5 వేలు ముందుగా పంచాయతీకి డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు. వేలం పొందిన అనంతరం సదరు వ్యక్తి 50శాతం డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు.

క్రైం కార్నర్

తుమ్మలపల్లిలో మూడు కాడెడ్లు అపహరణ



అపహరణకు గురైన కాడెడ్లు

మర్పల్లి, జూన్ 18:మండలంలోని తుమ్మలపల్లి గ్రామ శివారులో రేకుల షెడ్డులో నుంచి మూడు కాడెడ్లను దొంగిలించిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామానికి చెందిన బాధిత రైతు ఖాసీంఅలీ, ఆయన పెద్ద కుమారుడు రహిముద్దీన్ కోడలు సఫీయాబీలు వారికున్న నాలుగున్నర ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. గ్రామశివారులో తమ పొలంలో కాడెడ్లకు ఎండ, వాన నుంచి రక్షణగా ఉంటుందని రేకుల షెడ్డును ఏర్పాటు చేశారు. రోజూ మాదిరిగానే రేకుల షెడ్డులో మూడు కాడెడ్లను ఆదివారం కట్టేసి ఉంచారు. మరునాడు ఉదయం సోమవారం వచ్చి చూడగా కాడెద్దులు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. అపహరణకు గురైన కాడెడ్ల విలువ దాదాపు రూ.2లక్షల 50 వేలు ఉంటుందని బాధితులు వాపోయారు. ఈ సంఘటనపై బాధితుడు రహిముద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మర్పల్లి పోలీసులు తెలిపారు.

జర్నలిస్టు కుటుంబానికి ఆర్థిక సాయం



రాజు కుటుంబసభ్యులకు నగదు సాయం అందజేస్తున్న జర్నలిస్టులు

పరిగి, జూన్ 18: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సీనియర్ జర్నలిస్టు బి.రాజు కుటుంబానికి సహచర జర్నలిస్టులు బాసటగా నిలిచారు. మండలంలోని ఖుదావంద్‌పూర్ గ్రామానికి చెందిన బి.రాజు 20ఏళ్లగా వివిధ దినపత్రికల్లో పని చేశారు. అనారోగ్యంతో ఇటీవలే మృతిచెందిన సంగతి తెలిసిందే. పరిగి నియోజకవర్గంలోని జర్నలిస్టులు తోచినకాడికి చేసిన సాయంతో రూ.54వేల నగదును మంగళవారం వారి కుటుంబసభ్యులకు అందజేశారు. చేయూతను అందించిన జర్నలిస్టులకు పరిగి ప్రెస్‌క్లబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు జి.జైపాల్‌రెడ్డి, కె.ఆంజనేయులు, డి.శ్రీశైలం, పి.సురేష్, వి.శ్రీనివాసచారి, ఎన్వీవీ శ్రీనివాస్, ప్రకాశ్‌లు ఉన్నారు.

వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు



రైల్వేగేట్ స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ జయరాం

నవాబుపేట, జూన్ 18: మండలంలోని గేట్ వనంపల్లి గ్రామసమీపంలో గల రైల్వేగేటు దగ్గర అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. దీంతో మంగళవారం నవాబుపేట తహసీల్దార్ జయరాం, ఆర్ఐ సుశీల్ రైల్వే అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. నిత్యం రద్దీగా ఉండే సదాశివపేట రోడ్డు బ్రిడ్జి అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటైతే వాహనదారులకు, ప్రయాణికులకు మేలు జరుగుతుందని ప్రజలు తెలిపారు.

ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక



ప్రజావేదికలో మాట్లాడుతున్న ఎంపీపీ ఇందిర లక్ష్మీనారాయణ

కీసర, జూన్ 18: జాతీయ ఉపాధిహామీ పథకం పనులపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో 6వ విడత సామాజిక తనిఖీలో భాగంగా ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ మల్లారపు ఇందిర లక్ష్మీనారాయణ అధ్యక్షతన, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాంబశివరావు అధ్వర్యంలో 2023-204 సంవత్సరానికి గానూ చేసిన, చేపట్టిన పనులపై ఆయా గ్రామాల అధికారులు నివేదికను వేదికపై చదివి వినిపించారు. నివేదిక సరైనదా? కాదా? అని ఫీల్డ్ అధికారి రిపోర్టును పరిశీలించారు. అదే విధంగా జాబ్ కార్డులు ఎన్ని ఉన్నాయి, కూలీలకు వేతనాలు వారి ఖాతాలో జమ అవుతున్నాయా? లేదా? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు ఉపాధిహామీ పథకం పనులపై కీసర, తిమ్మాయిపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పూన వెంకటేష్, వైస్ ఎంపీపీ సత్తిరెడ్డి, ఎంపీటీసీలు నారాయణ శర్మ, వెంకట్‌రెడ్డి, ప్రమీలా, జూపల్లి వెంకటేష్, కిరణ్‌జ్యోతి ప్రవీణ్, ఎంపీడీవో గ్యామా, ఎంపీవో నందకిషోర్ పాల్గొన్నారు.

రంగంపల్లిలో పారిశుధ్యం అస్తవ్యస్తం



రంగంపల్లిలో ఇళ్ల మధ్యే మురుగు

పరిగి, జూన్ 18: మండలంలోని రంగంపల్లి గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. మురికి కాల్వల నిర్మాణానికి లేని కాలనీల్లో నిలిచిన మురుగుతో దుర్గంధభరితంగా మారిందని గ్రామస్థులు వాపోతున్నారు. డ్రైనేజీ నీటితో రోడ్ల వెంట వెళ్లేవారు ముక్కుమూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మురుగు కాల్వల్లో ముందుకు పారని దుర్గంధంతో పట్టణవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేక అధికారి, పంచాయితీ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుంటే ఇళ్ల మధ్యే నీరు నిలిచి ఇబ్బందికరంగా మారుతోందని వాపోతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే నానా ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఈ మురుగుతో రోగాలబారిన పడేఅవకాశాలు ఉన్నందున అధికారులు ఇప్పటికైనా స్పందించాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

వికారాబాద్, జూన్ 18: వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వీఆర్ఏ హక్కుల సాధన సమితి జిల్లా కమిటీ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు విజ్ఞప్తి చేశారు. సమితి రాష్ట్ర కన్వీనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం వికారాబాద్ కలెక్టర్‌ను కలిసి నోట్‌పుస్తకాలు, పెన్సిల్‌లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెండింగ్ వీఆర్ఏల సమస్యలను ఆయన కలెక్టర్‌కు వివరించారు. ఏ సమస్యలు ఉన్నా సీసీఎల్ఏ మార్గదర్శకాల మేరకు పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వీఆర్ఏ హక్కుల సాధన సమితి జిల్లా యూనియన్ నాయకులు శివకుమార్, సరోజ, జనార్దన్, యాదగిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.